

8 పేజీలు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్

శుక్రవారం | 01 డిసెంబర్ 2023 | www.navatelangana.com



పోలింగ్ ప్రశాంతం





- సంగారెడ్డి జిల్లాలో 73.83 శాతం..
- సిద్దిపేట జిల్లాలో 73.03 శాతం..
- మెదక్ జిల్లాలో 80.28 శాతం పోలింగ్ నమోదు
- రాత్రి 7.30 వరకు ఓట్లేసిన జనం
- ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు
- పలు చోట్ల చెదురుమదురు ఘటనలు
- సంగారెడ్డిలో జగ్గారెడ్డి, దుబ్బాకలో రఘునందన్‌రావు నిరసన

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చెదురుమదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. ఆటంకాల్లేకుండా పోలింగ్ సాగడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. సాయంత్రం 5 గంటలలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఉన్న ఓటర్లు రాత్రి వరకూ బారులు తీరి ఓటేశారు. ఓట్లేసిన ప్రముఖుల్లో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట జిల్లాలో ఓటేశారు. జిల్లా కలెక్టర్లు శరత్, రాజర్షి షా ఓటేశారు. అత్యధికంగా దుబ్బాక నియోజకవర్గంలో 82.75 శాతం పోలింగ్ నమోదు కాగా అత్యల్పంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో 69.72 శాతమే నమోదైంది. పోలింగ్ ప్రారంభంలో కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో పోలింగ్‌కు ఏలాంటి ఆటంకాలేర్పడలేదు. సంగారెడ్డి జిల్లాలో సాయంత్రం 5 గంటల వరకు నమోదైన పోలింగ్ వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా సగటు మిగతా 2లో..

చింతమడకలో..
ఓటేసిన సీఎం కేసీఆర్


నవ తెలంగాణ - సిద్దిపేట, సిద్దిపేట రూరల్

ముఖ్యమంత్రి కేసీఆర్ భార్య శోభతో కలిసి ఆయన తన స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా చింతమడకలో గురువారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో చింతమడకకు చేరుకున్నారు. ప్రత్యేక కాన్వాయిలో 13వ పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. మంత్రి హరీశ్‌రావు కూడా ఆయన వెంట ఉన్నారు. సీఎం కేసీఆర్ వస్తున్న సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం వచ్చే సమయానికి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి ఉన్నారు. నేరుగా సీఎం పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం గ్రామ పెద్దలతో, గ్రామస్తులతో కరచాలనం చేస్తూ పలకరించారు. కొన్ని నిమిషాలు గ్రామస్తులతో ముచ్చటించి, గ్రామంలో నిర్మాణం అవుతున్న దేవాలయాన్ని పరిశీలించారు. అనంతరం హైదరాబాద్ వెళ్లారు. సీఎం కేసీఆర్ వెంట మంత్రి హరీష్ రావు, సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి రామచంద్రరావు, జెడ్పిటీసి శ్రీహరి గౌడ్, సర్పంచ్ హంసకేతన్ రెడ్డి, ఎంపిటిసి జ్యోతి దేవేందర్, సర్పంచ్ హంసకేతన్ రెడ్డి, ఉప సర్పంచ్ మోత్కు రవి, బీఆర్ఎస్

మిగతా 2లో..









ఉమ్మడి మెదక్ జిల్లాలో గురువారం నిర్వహించిన పోలింగ్‌లో అన్ని వర్గాల వారు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓట్లు వేశారు.



చింతమడకలో ఓటేసిన సీఎం కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి

పట్టణంలోని భారత్ నగర్‌లోని పోలింగ్ బూత్ నంబరు 114లో మంత్రి హరీశ్‌రావు, ఆయన భార్య శ్రీనిత, కుమారుడు హర్చిస్ మాన్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చాలా పాజిటివ్ ఓటింగ్ జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ప్రజలు ఉత్సాహకంగా పాల్గొంటున్నారని చెప్పారు. గతంలో కంటే పోలింగ్ మెరుగ్గా ఉందన్నారు. రాష్ట్రం ఎవరి చేతుల్లో సురక్షితంగా ఉంటుందో, బాగుంటుందో మేధావులు, విద్యావంతులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఓటనేది 5 సంవత్సరాల భవిష్యత్ నిర్ణయించేదన్నారు. పట్టణ ప్రాంత ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనేందుకు ముందుకు రావాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ దేశపతి

పట్టణంలోని 80వ పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తన ఓటు హక్కును కుటుంబ సమేతంగా వినియోగించుకున్నారు. దేశపతి శ్రీనివాస్ భార్య సునీత, కూతురు సాహితి, కుమారుడు బాలార్క్ మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు గల్లంతైందని సెల్ టవర్ ఎక్కి యువకుడి నిరసన



నవతెలంగాణ-కొమురవెల్లి

ఓటర్ లిస్టులో తన ఓటు గల్లంతైందని ఓ యువకుడు కొమురవెల్లి మండల కేంద్రంలో సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, యువకుడు తెలిపిన వివరాల ప్రకారం... ఓటర్ లిస్టులో తన పేరు రాలేదని కొమురవెల్లికి చెందిన ముత్యం వెంకటేష్ నిరసన తెలిపారు. వెంకటేష్ గత ఎన్నికలలో ఓటు వినియోగించున్నారు. ఈసారి ఓటర్ లిస్టులో తన పేరు లేకపోవడంతో సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. అధికారులు, పోలీసులు సర్దిచెప్పడంతో నిరసన విరమించాడు.

ఓటు వేసిన 104 ఏళ్ల వృద్ధురాలు



నవ తెలంగాణ - సిద్దిపేట

ఓటు ఒక వజ్రాయుధం లాంటిది. దానిని సక్రమంగా వినియోగిస్తే మన భవిష్యత్తును మార్చేస్తుంది. ఎన్నికల్లో తానూ ఓటు వేసినట్లు జోహారాబీ(104) చెప్పారు. సిద్దిపేట పట్టణం బొర్ర హనుమాన్ దేవాలయ సమీపంలో నివసిస్తున్న వందేళ్లు పైబడిన ఈ బామ్మ పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం హైస్కూలులోని 127 పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేశారు. ప్రతి ఎన్నికల్లో ఓటు వేస్తున్నారని కుమారుడు ఫయాజ్ తెలిపారు.

ఓటు వేసిన శతాధిక వృద్ధురాలు

నవతెలంగాణ -వెల్దుర్తి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గురువారం పోలింగ్ నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఈశ్వరమ్మ భర్తను, కొడుకును, మనవడిని కోల్పోయి ఒంటరి జీవితాన్ని గడుపుతోంది. అన్ని పనులు తానే చేసుకుంటున్నారు. ఈ వయసులో పోలింగ్ బూత్ వరకు నడుచుకుంటూ వచ్చి ఓటు వేసిన ఘనత ఈమెకే దక్కింది.

ఎన్నికల విధి నిర్వహణలో గుండెపోటుతో ఉద్యోగి మృతి



నవ తెలంగాణ-పటాన్‌చెరు

ఎన్నికల వేల తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పోలింగ్ విధుల్లో పాల్గొన్న ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ వెటర్నరీ విభాగంలో అసిస్టెంట్‌గా పని చేస్తున్న సుధాకర్ (48) ఉద్యోగికి మండల పరిధిలోని ఇస్నాపూర్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 248లో ఎన్నికల విధులు కేటాయించారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఏర్పాట్లు చేసుకుంటుండగా చాతిలో నొప్పి అంటూ ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే సుధాకర్ ను పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలింగ్ విధులకు తమతో వచ్చిన సహచర ఉద్యోగి ప్రాణాలు కోల్పోవడంతో మిగతా సిబ్బంది విషాదంలో మునిగిపోయారు.

మొదటిసారి ఓటు వేసిన విద్యార్థులు

నవతెలంగాణ-మిరు దొడ్డి

శాసనసభ ఎన్నికల్లో మొదటిసారిగా 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఓటు హక్కు వేశారు. లింగుపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి, మహేశ్వరి మొదటిసారి ఓటు వేసి సంతోషం వ్యక్తం చేశారు.

పోలింగ్ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ శాతం 73.83 శాతం నమోదైంది. ఆ తర్వాత కూడా పలు చోట్ల ఓట్లు వేసినందున ఇది ఇంకాస్త పెరగనుంది. నియోజకవర్గాల వారిగా చూస్తే నారాయణఖేడ్‌లో 75.34 శాతం, అందోల్‌లో 76,12 శాతం, జహీరాబాద్‌లో 79.84 శాతం, పటాన్‌చెరులో 69.72 శాతం, సంగారెడ్డిలో 70.01 శాతం చొప్పున పోలింగ్ నమోదైంది. మెదక్ జిల్లాలో రెండు నియోజకవర్గాలకు గాను జిల్లా పోలింగ్ శాతం 80.28 శాతం ఉంది. నియోజకవర్గాల వారిగా నర్సాపూర్‌లో 78.89 శాతం, మెదక్‌లో 81.72 శాతం పోలింగ్ నమోదైంది. సిద్దిపేట జిల్లాలో ఉన్న నాలుగు నియోజకవర్గాలు కలిపి జిలాలో 73.03 శాతం పోలింగ్ నమోదైంది. గజ్వేల్‌లో 76.17 శాతం, హుస్నాబాద్‌లో 77.81 శాతం, సిద్దిపేటలో 73.03 శాతం, దుబ్బాకలో 82.75 శాతం పోలింగ్ నమోదైంది.

బారులు తీరి ఓట్లేసిన జనం

పొద్దునే షురూ అయిన పోలింగ్‌లో ఓటర్లు బారులు తీరి పాల్గొన్నారు. ఓటు వేయాలనే అవగహనా కార్యక్రమాల ప్రభావం పోలింగ్‌పై కనిపిస్తుంది. మూడు జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లోనూ మంచి పోలింగ్ నమోదైంది. పటాన్‌చెరులో మాత్రమే ఇతర నియోజక వర్గాల కంటే 5 శాతం తక్కువ పోలింగ్ నమోదైంది. 7 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకొచ్చారు. పోలింగ్ ప్రారంభమైన తర్వాత సాంకేతిక సమస్యలతో ఓటు వేసే ప్రక్రియ స్లోగా సాగింది. ఓటర్ల మాత్రం పొద్దున, సాయంత్రం పూట అధిక మంది పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. ఓటింగ్ వేసే ప్రాసెస్‌లో స్పీడ్ పెంచినా ఓటర్లు అత్యధిక పోలింగ్ కేంద్రాల్లో బారులుగా కనిపించారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగియాల్సి ఉన్నా చివరి అవర్‌లో అత్యధిక మంది రావడంతో సమయానికి వచ్చిన వాళ్లందరితోనూ ఓటు వేయించారు. దీంతో రాత్రి వరకు కూడా గజ్వేల్, అందోల్, మెదక్, నారాయణఖేడ్, హుస్నాబాద్ ఇతర నియోజకవర్గాల్లో రాత్రి 8.15 వరకు కూడా ఓట్లేశారు. పోలింగ్ కేంద్రం ఆవరణలో ఉన్న వాళ్లందరూ ఓటు వేసేందుక సయమం తీసుకోవడంతో పోలింగ్ ప్రక్రియ రాత్రి వరకూ సాగింది. తొలిసారి ఓటు హక్కు వచ్చిన యువత పెద్ద ఎత్తున ఓటు వేశారు.

మహిళలు, వృద్ధులు, వికలాంగులు భారీగా ఓట్లేశారు. దూర పాంత్రాల నుంచి లక్షలాది మంది వచ్చి సొంతూర్లలో ఓటేశారు. గజ్వేల్ అభ్యర్థి సీఎం కేసీఆర్ సైతం తన సొంతూరైన చింతమడలో ఓటేశారు. మంత్రి హరీశ్‌రావు కూడా సిద్దిపేటలో ఓటేశారు. మెదక్ కలెక్టర్ రాజర్షి షా, సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్ కూడా ఓటేశారు. వృద్ధులు, వికలాంగులు వచ్చి ఓటేసేందుకు వీల్ చైర్స్ సహాయంతో తీసుకెళ్లారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఇతర ప్రముఖులు కూడాలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చిన్న పాటి ఘటనలు

పోలింగ్ జరుగుతున్న సమయంలో మూడు జిల్లాల్లోని పలు చోట్ల చిన్నపాటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. పలు పోలింగ్ కేంద్రాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ గుంపులుగా మోహరించి ప్రచారం చేశారు. ఆ సందర్భంగా పలు చోట్ల చిన్నపాటి గొడవలు జరిగాయి. తూప్రాన్ పరిధిలోని కొల్చారంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకుల్ని కొట్టడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వాళ్ల పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. సంగారెడ్డిలో పలువురు కాంగ్రెస్ నాయకుల్నిపోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. దుబ్బాకలో రఘునందన్‌రావు కూడా స్టేషన్ ముందు ఆందోళన చేశారు. పలు చోట్ల పోలీస్‌లు చెదరగొట్టేందుకు లాఠీలకు పనిచెప్పారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్‌లో 248 పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సుధాకర్(48) తెల్లవారు జామున మాక్ పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తూ అస్వస్థతకు గురై మరణించారు.

స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు

మూడు జిల్లాల్లో కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్టాంగ్ రూముల్లో ఈవీఎంలను భద్రపరిచారు. పోలింగ్ ప్రక్రియ ముగిశాక ఆయా అభ్యర్థుల ఎజెంట్ల సంతకాలు తీసుకుని ఈవీఎంలను స్టాంగ్ రూములకు తరలించారు. పోలింగ్ కేంద్రాల వారిగా రూట్‌మ్యాప్ ప్రకారం ప్రత్యేక బలగాల భద్రతతో ఈవీఎంలను స్టాంగ్‌రూములకు చేరవేశారు. పోలింగ్ ఆలస్యంగా ముగియడంతో ఈవీఎం తరలింపు కూడా రాత్రి వరకూ కొనసాగింది. ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది, పోలీసులు, అధికారులు సైతం అర్ధరాత్రి వరకూ ప్రయాణాలు చేయాల్సి వచ్చింది.

నియోకజవర్గం	పోలింగ్ శాతం
సంగారెడ్డి జిల్లా	73.83
నారాయణఖేడ్	75.34
అందోల్	76.12
జహీరాబాద్	79.84
సంగారెడ్డి	70.01
పటాన్‌చెరు	69.72
సిద్దిపేట జిల్లాలో..	73.93
గజ్వేల్	76.17
దుబ్బాక	82.75
సిద్దిపేట	73.03
మెదక్ జిల్లా	80.28
నర్సాపూర్	78.89
మెదక్	81.72

ఓటెత్తిన ఓటర్లు

నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలోని ఓటర్లు పెద్ద ఎత్తున తమ ఓటు హక్కును గురువారం వినియోగించుకున్నారు. కేంద్రాల్లో ఉదయం ప్రారంభం నుంచి ఎన్నికల సమయం ముగిసే వరకు ఓటర్లు భారీగా భారులు తీరారు. మధ్యాహ్నంఓటింగ్ ప్రక్రియ మందకొడిగా సాగిన సాయంత్రం వరకు ఓటర్లు పెద్ద సంఖ్యలో భారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో సుమారు 75.12 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా మండలంలో సుమారు 83 శాతం ఓటు హక్కును ఓటర్లు వినియోగించుకున్నట్టు అధికారులు తెలిపారు.

గుడికందుల పోలింగ్‌బూత్‌ను పరిశీలించిన సీపీ శ్వేత

నవతెలంగాణ-తొగుట

అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా గుడికందుల గ్రామంలోని పోలింగ్ బూత్‌ను సీపీ శ్వేత గురువారం పరిశీలించారు. పోలీసు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్త వ్యవహరించాలని పోలీసులను ఆదేశించారు.

ఓటు వేసిన కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-తొగుట

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఓటు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రజలు ఓటు హక్కును వినియోంచుకోవాలని పిలుపునిచ్చారు. నరేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు ధన్యవాదాలు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి నియోజకవర్గంలో గత 40 రోజుల నుంచి అహర్నిశలు శ్రమించి కృషి చేసిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలకు, మహిళలకు,విద్యార్థులకు టీఎస్ ఎంఐడిసి చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ధన్యవాదాలు తెలిపారు. సంగారెడ్డి లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ మంచి మెజారిటీతో విజయం సాధించనున్నారని తెలిపారు.

ఓటు వేసిన అదనపు ఎస్పీ

నవతెలంగాణ-సంగారెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ పి.అశోక్ ఓల్డ్ కలెక్టర్ కార్యాలయంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జిల్లాలో నెల రోజులపాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్



నవతెలంగాణ-సంగారెడ్డి

శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని డిసెంబర్ 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. ముందస్తు అనుమతి లేనిది ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మనోహరాబాద్ మండలంలో ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో మెదక్ జడ్పి చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర ఫుడ్స్ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి కుటుబ సభ్యులతో కలిసి ఆయన స్వగ్రామం రామాయిపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అలాగే ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి, ధర్మరాజ్‌పల్లిలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రసిడెంట్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డి మనోహరాబాద్ మండల కేంద్రంలో, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్ ఎంపీటీసి నత్తి లావణ్య ముదిరాజ్ దంపతులు కాళ్ళాకల్‌లో ఓట్టు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా జడ్‌పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖట్‌గౌడ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ భారీ మెజారిటీతో గెలుపొందుతున్నాడని ప్రజలంతా సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ఓటేసి గెలిపిస్తున్నట్లు తెలిపారు. తిరిగి మూడో సారి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేజిక్కుంటుందని చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు.

వలస ఓటర్లకు ఇబ్బందులు

- రవాణా ఖర్చులు లేక అవస్థలు

- పోలింగ్ శాతం తక్కువగా నమోదుకు ఓ కారణం

నవతెలంగాణ-నంగునూరు

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడానికి వచ్చిన వలస ఓటర్ల ఇబ్బందులు అంతాఇంతా కావు. నంగునూరు మండలంలోని 37 పోలింగ్ కేంద్రాల్లో దాదాపు ప్రతి బూత్‌లో వందవరకు వలస ఓటర్లు ఉన్నట్లు సమాచారం. బీఆర్ఎస్ ఆదేశాల మేరకు ఏయే ప్రాంతాల్లో ఎంతమంది ఓటర్లు ఉన్నారో లెక్కలు తీశారు. దూరం ఎంతైనా రవాణా ఖర్చులు చెల్లించడానికి నేరుగా ముందుకు వచ్చేవారు లేక చాలా మంది ఓటింగ్‌కు దూరమైనట్లు కనబడుతోంది. కనీసం నంగునూరు మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేక అవస్థలు పడ్డామని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ వాహనాలు నంగునూరు మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాల్లోకి వయస్సు పైబడిన వారిని తరలించే క్రమంలో నిలిచిపోయాయి. దీంతో వాహన సదుపాయం లేక ఓటింగ్‌కే దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ మినహా మిగతా పార్టీలు వలస ఓటర్లకు పెద్దగా దృష్టి పెట్టడం లేదని చర్చించుకుంటున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ శాతం మందకొడిగా సాగింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఓటింగ్ శాతం పెరిగినా ఈ మండలానికి చెందిన వారే ఎక్కువగా ఉన్నట్లు కనబడటం గమనార్హం. బస్సు సౌకర్యం లేక ఓటర్లు అవస్థలు పడ్డారు. సిద్దిపేట అసెంబ్లీ ఎన్నికలకు సైతం ప్రైవేటు బస్సులు వాడుకున్నారు. రోజువారీగా వచ్చే బస్సులు కూడా నడవడం లేదని ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

శాంతియుతంగా శాసనసభ ఎన్నికలు

నవ తెలంగాణ మిరుదొడ్డి

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో భాగంగా మిరుదొడ్డి మండలం 23 పోలింగ్ కేంద్రాల్లో శాంతియుత వాతావరణంలో పోలింగ్ సాగింది. 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగానికి ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

నవతెలంగాణ 3
మెదక్
శుక్రవారం 01-12-2023 www.navatelangana.com

ఓటు వేసిన ఎమ్మెల్యే మదన్ రెడ్డి దంపతులు



నవతెలంగాణ-కౌడిపల్లి

నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి తన భార్య సుజాతతో కలిసి గురువారం కౌడిపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఓటు ప్రజాస్వామ్య పరిరక్షణకు వజ్రాయుధంలాంటిదని నియోజకవర్గంలోని ప్రజలందరూ స్వేచ్ఛగా ఎటువంటి ప్రలోభా లకు లొంగకుండా తమ ఓటును సద్వినియో గం చేసుకోవాలని మదన్‌రెడ్డి కోరారు. నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం ఖాయమని తెలిపారు.

ఓటేసిన కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ-మెదక్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా గురువారం మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు ఎస్పీ మహేందర్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ జిల్లా ఔరంగాబాద్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ రాజర్షి షా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే మెదక్ మండలం మాచవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో జిల్లా ఎస్పీ పి.రోహిణి ప్రియదర్శిని తన ఓటు హక్కును వినియోగించుకోగా, మెదక్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ తన ఓటు హక్కును



వినియోగించుకున్నారు. ఉన్నత పదవుల్లో ఉన్న అధికారులు సామాన్య ప్రజల్లో కలిసిపోయి క్యూలో నిలబడి తమ ఓటును వినియోగించుకొని పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు చాలా ప్రాధాన్యం ఉన్నదని, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలీస్ సిబ్బంది భద్రత కల్పించి, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

పోలింగ్ ప్రశాంతం

- జిల్లా వ్యాప్తంగా 80.28 శాతం నమోదు
- మెదక్ లో 81.72, నర్సాపూర్ లో 78.89 శాతం నమోదు
- జిల్లాలో అక్కడక్కడా స్వల్ప ఘర్షణలు
- మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ-మెదక్

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం మెదక్ జిల్లాలో అక్కడక్కడా స్వల్ప ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజవర్గాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఉదయం 10 గంటల వరకు మందకొడిగా సాగిన పోలింగ్ సాయంత్రం వరకు ఊపందుకుంది. తెలంగాణా రాష్ట్రంలోనే మెదక్ జిల్లాలో అత్యధికంగా 80.28 శాతం పోలింగ్ శాతం నమోదు కావడం విశేషం. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ సరళిని అధికారులు విడుదల చేశారు. మెదక్ నియోజకవర్గంలో 81.72 శాతం ఓట్లు పోల్ కాగా, నర్సాపూర్ నియోజకవర్గంలో 78.89 శాతం ఓట్లు పోలయ్యాయి. జిల్లాలో మొత్తం 4.40,341 లక్షల ఓటర్లు ఉండగా, 579 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. జిల్లాలో మొత్తం 24 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. మెదక్ నియోజకవర్గంలో 216748 ఓటర్లు ఉండగా, 274 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయగా 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అలాగే నర్సాపూర్ నియోజకవర్గంలో 223593 ఓటర్లు ఉండగా, 305 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయగా 11 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. గురువారం జరిగిన పోలింగ్‌లో మహిళలు, యువత, రైతులు, వృద్ధులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణను పరిశీలించారు. వృద్ధుల కోసం వీల్ చైర్, నీటి వసతి వంటి ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నారు. అంగన్ వాడీలు, ఆశా వర్కర్లు, బీఎల్వోలు, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది తమ సేవలను నిర్వహించారు. రామాయంపేట మండలం కోనాపూర్ లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మా దేవేందర్ రెడ్డి, చిన్నశంకరంపేట మండలం కోర్విపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్, నిజాంపేట్ మండలంలో బీజేపీ అభ్యర్థి పంజా విజయ్ కుమార్, హవేళీఘనపూర్ మండలం కుచన్ పల్లిలో ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



జిల్లాలో స్వల్ప ఘర్షణలు

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లాలో అక్కడక్కడా స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం ప్రాంగణం బయట బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతల మధ్య కొద్దిపాటి ఘర్షణ జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి పరిస్థితిని అదుపుచేశారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు తనపై దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ మెదక్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గంగాధర్ పట్టణ పోలీసు లకు ఫిర్యాదు చేశారు. అలాగే మెదక్ పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు తన వాహనాన్ని అడ్డుకొ ని దాడికి యత్నించి, భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపిస్తూ మెదక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మైనంపల్లి రోహిత్ సతీమణి శివానీ రెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యా దు చేశారు. అలాగే కౌడిపల్లి, కొల్చారం, రామాయంపేట, పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య కొద్దిపాటి ఘర్షణ వాతావరణం నెలకొనడంతో అప్రమత్తమైన పోలీసులు పరిస్థితిని అదుపుచేసి ఆందోళనకారులను చెదరగొట్టారు.

ప్రశాంత వాతావరణంలో ముగిసిన పోలింగ్

- అక్కడక్కడ చిన్నపాటి గొడవలు మినహా ప్రశాంతం
- కూచారంలో పోలీసుల తీరుకు నిరసనగా పోలింగ్ గేటును మూసేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

అక్కడక్కడ చిన్నపాటి గొడవలు జరిగిన సంఘటనలు మినహా తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రెండు, మూడు గ్రామాలలో మాత్రం బీఆర్ఎస్ నాయకులకు పోలీసులకు తీవ్ర వాగ్వాదం జరగ్గా పోలింగ్ స్టేషన్ గేటును మూసేసి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొండాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటేయకపోతే సంక్షేమ పథకాలు రావంటూ ప్రచారం చేస్తున్నట్లు తెలుసుకున్న బీజేపీ నాయకులు గొడవలకు దిగారు. దాంతో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను బయటకు పంపించడంతో గొడవ సద్దుమణిగింది. కాగా తూప్రాన్ మండలంలో 37 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా అందులో పురుషులు 16299, మహిళలు 16745, ట్రాన్స్‌జెండర్



ఒకరు ఉండగా మొత్తం 33045 మంది ఓటర్లు ఉన్నారు. మనోహరాబాద్ మండలంలో 22 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా అందులో పురుషులు 8912, మహిళలు 8963 మంది ఓటర్లు ఉండగా మొత్తం 17875 మంది ఓటర్లు ఉన్నారు. గురువారం జరిగిన గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి గురువారం జరిగిన పోలింగ్‌లో ఉదయం నుంచి ప్రారంభమైన పోలింగ్‌కు ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ఓటింగ్‌లో పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. పోలింగ్ స్టేషన్‌ల వద్ద విద్యార్థులకు పోలింగ్‌పై అవగాహన కలిగే విధంగా పోలింగ్ స్టేషన్‌ల వద్ద వాలెంటీర్లుగా నియమించి ప్రజలకు సేవలందించే విధంగా వారిని స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేశారు. వృద్ధులు ఓటింగ్‌కు వస్తే వారికి ఇబ్బందులు లేకుండా వీల్ చేర్‌లపై తీసుకెళ్లి ఓటింగ్ వేయించే విధంగా సేవలందించారు. పోలింగ్ మాత్రం అక్కడక్కడ చిన్నపాటి సంఘటనలు మినహ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గజ్వేల్ నియోజక వర్గంలో మొత్తం 44 మంది అభ్యర్థులు బరిలో ఉండగా ప్రముఖంగా బీఆర్ఎస్, బీజేపీల మధ్యే తీవ్రంగా పోటీ నెలకొనే పరిస్థితి ఉన్నట్టు ఓటర్ల ద్వారా తెలుస్తుంది. అయినా ఎవరి పరిస్థితి ఏంటనేది ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. డిసెంబర్ మూడవ తేదీ వరకు ఎవరి పరిస్థితి ఏంటనేది వేచి చూడాల్సిందే. కాగా ఈ ఎన్నికల్లో నూతనంగా ఓటు హక్కును పొందిన యువకులు మొదటి సారి ఓటుహక్కును వినియోగించుకోవడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో మొదటి సారి ఓటు హక్కును పొందిన యువకులే కీలకంగా మారే అవకాశం ఉంది.



డిసెంబర్ 4న చలో ఢిల్లీ

నవతెలంగాణ-నిజాంపేట్



దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టి సబ్ ప్లాన్ చట్టం చేయాలని, భారత రాజ్యాంగ స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్న బీజేపీ విధానాలను నిరసిస్తు, రాజ్యాంగాన్ని కాపాడుకో వాలని పిలుపునిస్తూ డిసెంబరు 4న జరిగే చలో ఢిల్లీకి దళితులు తరలిరావాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ కోరారు. ఛలో ఢిల్లీ పోస్టర్‌ను గురువారం నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో విడుదల చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, పంగ ప్రశాంత్, కొమ్మాట మోహన్, బొర్ర శ్రీకాంత్, మద్దికుంట బాను తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన సీయూ

నవ తెలంగాణ-టేక్మాల్



మండల పరిధిలోని శాబాద్ తండాలోని పోలింగ్ బూత్ నెంబర్ 85లో ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన ఈవీయం లోని సీయూ (కంట్రోల్ యూనిట్) పది నిమిషాల పాటు మొరాయించడంతో అక్కడ ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. చాలా సేపటి వరకు ఓటర్లు అధిక సంఖ్యలో బారులు తీరి కనిపించారు. కొద్దిపాటు గందరగోళం ఏర్పడడంతో ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ తుక్కయ్యలు సిబ్బందితో ఓటర్లను అదుపు చేశారు. వెంటనే స్పందించిన పోలింగ్ ఆఫీసర్ కొత్త సీయూను అమర్చి పోలింగ్ పున ప్రారంభించారు.

నర్సాపూర్‌లో ఎన్నికలు ప్రశాంతం

78.89 శాతం పోలింగ్

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ నియోజక వర్గంలో గురువారం జరిగిన శాసనసభ సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గంలో మొత్తం రెండు లక్షల ఇరవై మూడు వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో 78.89 శాతం ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కాగా సాయంత్రం ఐదు గంటల వరకు ఓటర్లు ఓటు హక్కు వినియోగి ంచుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. నర్సాపూర్ పట్టణానికి చెందిన చంద్రయ్య గౌడ్ తన పేరు ఓటర్ లిస్టులో లేదని అధికారులను అడిగినా ఫలితం లేకపోవడంతో వెనుతిరిగి వెళ్ళిపోయాడు. నర్సాపూర్లో పోలింగ్ సరళిని బీఆర్ఎస్ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి బిజెపి అభ్యర్థి మురళి యాదవ్ తదితరులు పరిశీలించారు. నర్సాపూర్లో తూప్రాన్ డిఎస్పి యాదగిరి రెడ్డి, సిఐ షేక్‌లాల్ మదర్ ఎస్ఐ శివకుమార్‌లు పోలీసులు , కేంద్ర బలగాలు బందోబస్తును నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

నవతెలంగాణ- చేగుంట: చేగుంట మండలంలోని 28 గ్రామపంచాయతీ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి, దాదాపుగా అన్ని పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఓటింగ్ శాతం 85.65 జరిగాయి. పట్టణ కేంద్రంలో 229 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం వద్ద వెంటిలేషన్ లేదని ఓటర్లు ఆరోపించారు. అలాగే వృద్ధులకు, వికలాంగులకు వీల్ చైర్ సాయంతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు వాలంటరీగా తమ విధులను నిర్వహించారు. పట్టణంలో జరుగుతున్న ఎన్నికలను మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి మేడం పరిశీలించారు.

నవతెలంగాణ-చిలిపిచేడ్ : మండలంలోని ఎలాంటి అలజడి లేకుండా ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. మండలంలోని 87% పోలింగ్ నమోదయిందని తహసీల్దార్ ముసాదిక్ తెలిపారు. వృద్ధులు వీల్ చైర్ పై ఓటు వేశారు. కొన్ని ఈవీఎంలు మొరాయించినా కొత్తవి ఏర్పాటు చేసి ఎలాంటి అటంకాలు రాకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని 14 గ్రామపంచాయతీలలో గురువారం అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఏ గ్రామంలో కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు.బచ్చురాజు పల్లి గ్రామంలో 20 నిమిషాలు ఈవీఎం మొరాయించడంతో ఎన్నికల సిబ్బంది వేరే ఈవీఎంను అమర్చారు. మెదక్ బీజేపీ అభ్యర్థి పంజా విజయ్ కుమార్ మండల కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ స్టేషన్‌కు దాదాపు 200 మీటర్ల దూరంలో పార్టీల కార్యకర్తలను పరిమితం చేశారు. మండలంలో 85% ఓటింగ్ జరిగింది.

నవతెలంగాణ

ఓటు వేసిన కాంగ్రెస్ అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్






నవతెలంగాణ-అమీన్ పూర్
పటాన్ చెరు నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాటా శ్రీనివాస్ గౌడ్,ఆయన సతీమణి 15వ వార్డ్ కౌన్సిలర్ కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 138 పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీఎస్పీ అభ్యర్థి నీలం మధుముదిరాజ్, బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి ఓటు వేశారు.

ఓటు వేసిన సీపీఎం జిల్లా కార్యదర్శి



నవతెలంగాణ- సదాశివపేట: సదాశివపేట పట్టణంలో అసెంబ్లీ ఎలక్షన్స్ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి. జయరాజ్ కుటుంబ సమేతంగా గురువారం 191 పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందరూ ఓటు వేయాలని కోరారు.

ఓటు వేయడానికి వచ్చి వ్యక్తి మృతి



నవతెలంగాణ-మిరు దొడ్డి
ఓటు వేయడానికి వచ్చి వ్యక్తి మృతి చెందిన సంఘటన అక్బర్ పేట భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన బాసస్వామి కొన్ని రోజుల క్రితం హైదరాబాదుకు జీవనోపాధి కోసం వెళ్లి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శాసనసభ ఎన్నికల ఎన్నికల నేపథ్యంలో సొంత గ్రామం రుద్రారంలో ఓటు వేద్దామని వచ్చారు. ఓటర్ స్లిప్పు కోసం ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కళ్లు తిరిగి ఒకేసారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య కళావతి ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖ సంఘ సేవకులు



నవతెలంగాణ- గజ్వేల్
అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం గజ్వేల్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పోలింగ్ కేంద్రంలో యువతతో కలిసి ప్రముఖ సంఘ సేవకులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు ఓటు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న వైస్ ఎంపీపీ



నవతెలంగాణ-తొగుట
వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. గురువారం మండలంలోని కాన్గల్ గ్రామానికి చెందిన బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సతీమణితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక రూరల్
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దుబ్బాక బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి గురువారం తన కుటుంబ సభ్యులతో కలిసి తన సొంత గ్రామం పోతారంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన వెంట సతీమణి మంజులత, తనయుడు పృథ్వీరెడ్డి, గ్రామ సర్పంచ్ గడిల జనార్ధన్ రెడ్డి, పార్టీ నాయకులు కిషన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటు వేసిన కౌన్సిలర్



నవతెలంగాణ-జోగిపేట
జోగిపేట పట్టణంలోని 17వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు దంపతులు గురువారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓట్లు వేసేందుకు ఓటర్లకు ఇక్కట్లు

- పలు చోట్ల ఉదయం గంట ఆలస్యంగా మొదలైన ఓటింగ్
- రాత్రి 9 గంటల వరకు క్యూ లైన్ లో నిలబడ్డ ఓటర్లు
- పోలీసుల బందోబస్తు నడుమ ఓట్లు వేసిన ప్రజలు




నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్
గజ్వేల్ నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలు చిన్నచిన్న గొడవల మధ్య ప్రశాంతంగా ముగిసాయి. గురువారం ఉదయం 7 గంటలకు గజ్వేల్ మండలంలో ఓట్లు వేసేందుకు ప్రజలు బారులు తీరారు. గజ్వేల్ మండల పరిధిలోని అర్ అండ్ ఆర్ కాలనీలో బూత్ నెంబర్ 198 ఎర్రవల్లి లో ఈవీఎం మోరాయించింది.207 బూత్ నెంబర్, 54 బూత్ గిరిపల్లిలో ఈవియం లు మొరాయించాయి. వాటిని అధికారులు సరిచేసి సమస్య పరిష్కరించారు. గంట ఆలస్య వ్యవధిలో 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఆర్ అండ్ ఆర్ కాలనీలోని 198 బూత్ నంబర్ ఎర్రవల్లిలో మోరాయించిన ఈవీఎంను అధికారులు సరిచేసినప్పటికీ అది నెమ్మదిగా పనిచేయడం మొదలుపెట్టింది. మొత్తం ఎర్రవెల్లిలో 1387 కోట్లు ఉండగా మధ్యాహ్నం మూడు గంటలు సమయానికి కేవలం 500 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో ఓటర్లు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలాంటి పరిస్థితి వస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు సమకూర్చకుండా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఓటు వేసేందుకు వృద్దులు చిన్నపిల్లలతో వచ్చిన తల్లులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఓటర్లు ఉదయం నుండి సాయంత్రం వరకు క్యూ లైన్ లో వేచి ఉండడం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సాయంత్రం ఐదు గంటల లోపు ఎవరైతే గ్రౌండ్ ఆవరణ లోపల ఉన్నారో వారికి టోకెన్లు ఇచ్చి ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. రాత్రి 9 గంటల వరకు వారికి సమయాన్ని కేటాయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గజ్వేల్ సిఐలు జాన్ రెడ్డి, రంగకృష్ణ అక్కడే ఉండి పర్యవేక్షించారు.

మండలంలో స్వల్ప ఘర్షణలు

గజ్వేల్ మండల పరిధిలోని సంగుపల్లి, ప్రజ్ఞాపూర్, ఆర్ అండ్ ఆర్ కాలనీలలో స్వల్ప ఘర్షణకు తావిచ్చాయి. సంగుపల్లి గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు మద్యం, డబ్బు పంచారని గ్రామస్తులు రోడ్డుపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో కాంగ్రెస్ వారికి ఒక కూల్ డ్రింక్ మాత్రమే ఇచ్చారని ఆ బాటిల్లను తీసుకువచ్చి రోడ్డుపై పారబోశారు. అంతేకాకుండా ఆర్ అండ్ ఆర్ ఎర్రవల్లిలో వృద్దులు చంటి పిల్ల తల్లులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓటు వేయడానికి ఇన్ని ఇబ్బందులు పడాల్సిందేనా అని వాపోయారు.ఓటర్ల మధ్య తోపులాట జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు వారిని సంధాయించడంతో ఓటర్ నమోదు కార్యక్రమం సజావుగా సాగింది. ప్రజ్ఞాపూర్ లో ఎన్నికల పర్యవేక్షణకు గజ్వేల్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈటెల రాజేందర్ వచ్చారు. ప్రజ్ఞాపూర్ హైస్కూల్లో 20 మందితో లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లోపలికి వెళ్లిన ఈటల రాజేందర్ వెంటనే అక్కడి నుంచి పంపించేయాలని నినాదాలు చేశారు. పోలీసులు, ఎన్నికల అధికారులు రాజేందర్ ను అక్కడ నుంచి పంపించేశారు. దాంతో ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి.

అభ్యర్థుల సంఖ్య ఎక్కువ

- తికమక పడ్డ వృద్ధులు






నవతెలంగాణ-తొగుట
11 మంది అభ్యర్థులు పోటీలో నిలవడంతో వృద్దులు ఓటు వేయడానికి ఇబ్బంది పడ్డారు. ఈవీఎంపై ప్రధాన పార్టీల అభ్యర్థుల గుర్తులు పైభాగంలో ఉండడంతో వృద్ధులు పైభాగం వైపు చూడలేక పోయారు. వారికి ఈవీఎంపై ఉన్న గుర్తులు క్లియరుగా కనిపించక పోవడంతో కింది భాగంలో ఉన్న గుర్తులపై వృద్ధ ఓటర్లు ఓట్లు వేశారని తెలిసింది. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులకు నష్టం కలిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. అక్కడక్కడా ఒకటి రెండు బూత్‌లు మినహా అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్లు ఓటు హక్కును సజావుగా వినియోగించుకున్నారు. ఎల్లారెడ్డి పేట, గుడికందుల, కనుగల్, తొగుట, వెంకట్రావు పేటలలో పోలింగ్ మందకొడిగా సాగింది. వర్ధరాజ్‌పల్లి, లింగం పేట గ్రామాలలో మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటర్ల లేకపోవడం గమనార్హం. వికలాంగులకు, వృద్దులకు అందుబాటులో వీల్‌చైర్ ఏర్పాటు చేసి ఓటు వేయడానికి ఏర్పాట్లు చేశారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు





నవతెలంగాణ-కోహెడ
ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడోసారి జరిగిన ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. కోహెడ మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో శాసనసభ ఎన్నికలలో ఓటర్లు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హుస్నాబాద్ నియోజకర్గం నుండి 19 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. అలాగే గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల అభ్యర్థులు నలుగురు కాగా మిగతా 15 మంది అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో పాల్గొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 77.81 శాతం ఓటింగ్ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. వింజపల్లి, ఎర్రకుంటపల్లి గ్రామాలకు రెండు పోలింగ్ బూత్‌లు ఉండగా అక్కడ కూడ జనం ఎక్కువ సమయం ఓటు వేసేందుకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ



నవతెలంగాణ-మద్దూరు
మద్దూరు దూల్మిట్ట మండలాల్లోని అన్ని గ్రామాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళిని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి సర్పంచ్ బద్దిపడగ లలిత దంపతులు, మర్మములలో వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం, గాగిల్లాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.




ఓటు హక్కు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- దుద్దెడలో ఓటు వేసిన కలెక్టర్, సీపీ




నవతెలంగాణ-కొండపాక
ఓటు హక్కు ప్రతి వయోజనుడి సామాజిక బాధ్యత అని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. గురువారం గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాక మండలం దుద్దెడలోని 91వ మోడల్ పోలింగ్ స్టేషన్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఓటు వేశారు. జిల్లాలో సాధారణ ఎన్నికలకు 1151 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని సౌకర్యాలతో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ ఓటును సామాజిక బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైందని తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

కొండపాక మండల పరిధిలోని దుద్దెడ 91వ మోడల్ పోలింగ్ స్టేషన్‌లో సిద్దిపేట పోలిస్ కమిషనర్ శ్వేత, మండల కేంద్రమైన కొండపాకలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బంగారం గ్రామంలో ఎంపీపీ రాగల సుగుణ దుర్గయ్య, కొండపాక లో జెడ్పీటీసీ అనంతుల అశ్విని ప్రశాంత్, జప్తి నాచారంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు చింతల సాయిబాబా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటింగ్‌లో పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు




నవతెలంగాణ-నంగునూరు
అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి హరీశ్‌రావు గెలుపు కోసం నంగునూరు మండలానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు సొంత గ్రామాల్లోనే ఉంటూ ఓటింగ్ పెంచేందుకు కృషి చేశారు. నంగునూరు మండలం నుంచి దాదాపు ఇరవై ఐదు శాతం పట్టణ ప్రాంతాల్లో ఉంటూ పరిపాలనా కొనసాగిస్తున్నట్లు కనబడుతోంది. సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి తన్నీరు హరీశ్‌రావు నంగునూరు మండల ప్రచారం ఒకే రోజుకు పరిమితం అయింది. నంగునూరు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పదిహేను రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి ఏం చేద్దామంటూ ప్రణాళికలు తయారు చేశారు. తదనుగుణంగా ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు సిద్ధమయ్యారు. నంగునూరు మండలంలోని మైసంపల్లి గ్రామంలో ఎంపీపీ జాప అరుణాదేవి ఓటు వేశారు. మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి సైతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. జెడ్పీటీసీ తడిసిన ఉమా బద్దిపడగలో, మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య పాలమాకులలో, పాలమాకుల సొసైటీ చైర్మన్ మహిపాల్ రెడ్డి వెంకటాపూర్‌లో, రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి గట్లమల్యాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న అభ్యర్థులు




నవతెలంగాణ నర్సాపూర్:
నర్సాపూర్ అసెంబ్లీ అసెంబ్లీ స్థానానికి గురువారం జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి శివంపేట్ మండలం గోమారం గ్రామంలో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి స్వగ్రామమైన మాసాయిపేట లో భార్య శైలజా రెడ్డి తో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. నర్సాపూర్ లో బిజెపి అభ్యర్థి ఎర్రగుళ్ల మురళీధర్ యాదవ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే మదన్ రెడ్డి తన స్వగ్రామమైన కౌడిపల్లి కేంద్రంలో భార్య సుజాత తో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ గ్రామంలో ఎంపీటీసీ సంధ్యారాణి చత్రు నాయక్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే రెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివన్న గారి ఆంజనేయులు గౌడ్ సతీమణితో కలిసి ఓటు హక్కు ను వినియోగించుకున్నారు.

ఓటేసిన ప్రముఖులు




నవతెలంగాణ-జోగిపేట
అందోలు నియోజకవర్గంలో గురువారం ఆయా పార్టీల అభ్యర్థులు, ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ జోగిపేటలోని మార్కెట్ యార్డ్ వద్ద, బిజెపి అభ్యర్థి బాబు మోహన్ జోగిపేట మార్కెట్ యార్డు వద్ద, బీఎస్పీ అభ్యర్థి ముప్పారం ప్రకాశం తన సొంత గ్రామమైన డాకూర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ బిక్షపతి, జిల్లా జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి తమ సొంత గ్రామాలైన మరెల్లి, డాకూర్ గ్రామంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

డౌట్ లేదు విజయం మనదే

- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక
డౌట్ లేదు దుబ్బాకలో విజయం మనదేనని, ఇది దుబ్బాక ప్రజల విజయంగా మారుతుందని మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దుబ్బాకలో బీఆర్ఎస్ జండా ఎగరడానికి కష్టపడ్డ, సహకరించిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. మూడోసారి రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రొట్టె రాజమౌళి, మనోహర్‌రావు, కోమటిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, సోలిపేట సతీష్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, కౌన్సిలర్ ఆస యాదగిరి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణ గౌడ్, యూత్ అధ్యక్షుడు దొమ్మాట భూపాల్ కార్యకర్తలున్నారు.

ఓటు వేసిన చింతా ప్రభాకర్




నవతెలంగాణ- సదాశివపేట, సంగారెడ్డి
గురువారం నాడు అసెంబ్లీ ఎలక్షన్స్ సందర్భంగా సదాశివపేట పట్టణంలో గల రవీంద్ర మోడల్ ప్రాథమిక పాఠశాలలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ తన కుటుంబ సమేతంగా 187 పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంగారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తూర్పు జయప్రకాశ్ రెడ్డి తన ఓటు హక్కు ను ప్రభుత్వ బాయ్స్ హై స్కూల్ లో వినియోగించుకున్నారు.

నాగులపల్లిలో గంటపాటు మొరాయించిన ఈవీఎం



నవతెలంగాణ-వట్‌పల్లి
మండలంలో ఆయా గ్రామాలలో గురువారం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ ఐదు గంటలకు ప్రశాంతంగా మూసింది. నాగులపల్లిలో ని 120 పోలింగ్ కేంద్రంలో గంటపాటు సాంకేతిక కారణాలతో ఈవీఎం మొరాయించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతి కిరణ్ తన స్వగ్రామమైన పోతుల బొగుడలో కుటుంబ సమేతంగా తన తండ్రి భూమయ్యతో పాటు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒక్కో సెక్టరులో 75 నుండి 80 శాతం వరకు పోలింగ్ శాతం నమోదయింది.

తొలిసారి ఓటేసిన మహిళా ఓటర్లు



నవతెలంగాణ-దుబ్బాక రూరల్
సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామానికి చెందిన మహిళా ఓటర్లు, యువతులు గురువారం దుబ్బాక అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఓటేసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు తొలిసారి ఓటు వేయడం ఆనందంగా ఉందన్నారు.

అభ్యర్థుల ఓటు హక్కు వినియోగం




నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్
బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహారెడ్డి భూపాల్ రెడ్డి సొంత గ్రామం అయినా ఖానాపూర్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పట్ల సంజీవరెడ్డి నారాయణఖేడ్ జెడ్ పి హెచ్ ఎస్ లో ఓటు వేశారు. బిజెపి అభ్యర్థి తన స్వగ్రామమైన చౌకన్పల్లిలో ఓటు వేశారు. నియోజకవర్గంలో 75.34 శాతం ఓటింగ్ నమోదైంది.

ఓటు వేసిన బీఎస్పీ అభ్యర్థి



నవతెలంగాణ-బెజ్జంకి
మండలంలోని చీలాపూర్ గ్రామంలో గురువారం మానకొండూర్ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి నిషాని రామచంద్రం దంపతులు ఓటు వేశారు. మండలంలోని దాచారం గ్రామంలో జెడ్పీటీసీ కడగండ్ల కవిత దంపతులు ఓటు వేశారు.

పార్టీలకు గుణపాఠం చెప్పాలి



నవతెలంగాణ మిరుదొడ్డి
మద్యం, ధన ప్రభావంతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని దుబ్బాక స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి పల్లెటూరు ప్రసాద్ అన్నారు. ధన ప్రభావంతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు వ్యవహరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తన స్వంత గ్రామమైన లింగుపల్లి గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అభ్యర్థి

నవతెలంగాణ-జగదేవపూర్
జగదేవపూర్ మండల కేంద్రం లో కొనసాగుతున్న ఓటింగ్ సరళిని గురువారం మధ్యాహ్నం గజ్వేల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈటెల రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రజల ఓట్ల ద్వారా ప్రజలు ఆశీర్వదిస్తే గెలుపు వరిస్తుందన్నారు. ప్రజల ఆశీర్వాదంపై గెలుపు ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రజల తీర్పులు ప్రతి ఒక్కరు శిరసా వహించాల్సిందని అన్నారు.



పోలింగ్ ప్రశాంతం

- కొన్ని ప్రాంతాలలో ఈవీఎం మొరాయింపు
- సమయం ముగిసిన తర్వాత బారులు తీరిన ఓటర్లు

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్ధిపేట జిల్లాలోని హుస్నాబాద్, సిద్ధిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గంలోని అసెంబ్లీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 5.30 గంటలకు ఎన్నికల అధికారులు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం ఐదు గంటల తర్వాత కూడా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు క్యూలైన్లో నిలిచి ఉండడంతో పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా పోలింగ్ జిల్లాలో జరిగింది. సాయంత్రం ఐదు గంటల వరకు సిద్ధిపేట నియోజకవర్గంలో 73.03 శాతం, దుబ్బాక నియోజకవర్గంలో 82.75 శాతం, హుస్నాబాద్ నియోజకవర్గంలో 77.81 శాతం, గజ్వేల్ నియోజకవర్గంలో 76.17 శాతం పోలింగ్ అయినట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో కూడా కొంత మార్పు ఉండే అవకాశం ఉన్నది. చిన్నకోడూరు మండలం గంగాపూర్ లో ఓ పోలింగ్ కేంద్రంలోని ఈవీఎం మొరాయించడంతో అక్కడ కొంతసేపు పోలింగ్ ను నిలిపివేశారు. సిద్ధిపేట పట్టణంతోపాటు మరికొన్ని ప్రాంతాలలో కూడా ఈవీఎంలు మొరాయించడంతో కొంత పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఈవీఎం మొరాయించిన ప్రాంతాలలో అధికారులు వాటిని సరిచేసి పోలింగ్ ను ప్రారంభించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేశారు. 144 సెక్షన్ ను కట్టుదిట్టంగా అమలు చేశారు. తొగుట మండలం చందాపూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ ఇతర బిఆర్ఎస్ నాయకులు



అక్కడికి వెళ్లగా బిజెపి నాయకులు అడ్డుకొని వేను తిరిగి పంపించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అభ్యర్థులు

పోలింగ్ సరళినీ తెలుసుకోవడానికి పోటీలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన, స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బిఆర్ఎస్ అభ్యర్థులు మంత్రి హరీశ్ రావు, సతీష్ , కొత్త ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పొన్నం ప్రభాకర్, పూజలహరి కృష్ణ , నర్సారెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు, బిజెపి, బీఎస్పీ , ఇతర స్వతంత్ర అభ్యర్థులు వారి నియోజకవర్గం పరిధిలోని అనేక పోలింగ్ సెంటర్లను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, పోలీస్ కమిషనర్ శ్వేతాలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు.

సమయం ముగిసిన క్యూలైన్లలో ఓటర్లు

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గటల వరకు పోలింగ్ కు అవకాశం ఉండగా గజ్వేల్ నియోజకవర్గం లో సాయంత్రం ఐదు గంటలు దాటిన తర్వాత కూడా ఓటర్లు ఓటు కోసం క్యూలైన్లలో బారులు తీరారూ. వారందరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అధికారులు వారికి అవకాశం కల్పించారు.

ఈవీఎంలలో అభ్యర్థుల ఫలితాలు నిక్షిప్తం

తామే గెలవాలనుకుని, తాము ఎమ్మెల్యే కావాలనుకున్న అభ్యర్థుల ఫలితాలు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్నాయి. ఎవరు ఎమ్మెల్యే అవుతారో... ఎవరికి ఓటర్లు పట్టంకట్టనున్నారో మూడవ తేదిన బయటపడనుంది. ప్రస్తుతం ఓటర్లు అభ్యర్థుల యొక్క ఫలితాలను ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు.



హుస్నాబాద్‌లో పోలింగ్ ప్రశాంతం

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే సతీష్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో గురువారం హుస్నాబాద్ లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. హుస్నాబాద్ పట్టణం, గ్రామీణ ప్రాంతాలలో ఉదయం 7 గంటలకే ప్రారంభమైన పోలిం గ్ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. హుస్నాబాద్ నియోజకవర్గంలో 77.81 శాతం నమోదు అయ్యింది. హుస్నాబాద్ లో ఇలాంటి మంచినీయ సంఘటనలు చేసుకోకుండా హుస్నాబాద్ ఏసిపి సతీష్ ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సమస్య లేకుండా పర్యవేక్షణ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోనీ పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే సతీష్ కుమార్ సందర్శించి పోలింగ్ తీరను పర్యవేక్షించారు.

గజ్వేల్‌లో ప్రశాంతంగా ఎన్నికలు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు చెదురు మధురు సంఘటన తప్ప ప్రశాంతంగా ముగిసాయి. రెండు లక్షల 74 వేల పై పైచిలుక ఓట్లు నియోజకవర్గంలో ఉండగా సాయంత్రం ఐదు గంటల వరకు 74.98 వరకు కాగా ఇంకా చాలా చోట్ల ఓటర్స్ వరుసలో ఉన్నారు. నియోజకవర్గంలో వర్గల్, ములుగు, మర్కుక్, తూప్రాన్, మనోహరాబాద్, కుకునూరు పల్లి, కొండపాక, గజ్వేల్ మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుండి 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించగా చాలా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్స్ ఉండటం వల్ల మరో గంట వరకు మరింత శాతం పెరిగే అవకాశం ఉంది. ఆయా రాజకీయ పార్టీలు పోలింగ్ శాతం పెంచేందుకు ప్రయత్నాలు చేశారు. గ్రామాల నుండి పోలింగ్ ఈవీఎంలను నేరుగా సిద్ధిపేటకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోలీస్ బందోబస్తు అడుగడుగున ఏర్పాటు చేశారు. ఈవీఎంలను మాయ రాజకీయ పార్టీల సంతకాలు తీసుకొని ప్యాకింగ్ చేశారు. కాంగ్రెస్, బిజెపి, బి ఆర్ ఎస్ పార్టీ లు పోటాపోటీన ప్రచారం నిర్వహించుకున్నారు. ఈనెల మూడున అభ్యర్థుల భవితం పడనున్నది.

జగదేవపూర్‌లో పోలింగ్ ప్రశాంతం

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ మండల వ్యాప్తంగా 36 పోలింగ్ బూతుల్లో పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మహిళలు ఎక్కువ సంఖ్యలో ఒటింగ్ లో పాల్గొన్నారు. మధ్యాహ్నం వరకు ఓటర్లు వరుసలో నిలబడి ఓటు హక్కును వియోగించుకున్నారు.

మండలంలో పోలింగ్ ప్రశాంతం


నవతెలంగాణ-కొండపాక



కొండపాక కుకునూరుపల్లి మండలాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పలు గ్రామాల్లో మహిళలు బారులు తీరారు. గజ్వేల్ ఏసీపీ రమేష్, త్రీ టౌన్ సీఐ భాను ప్రకాష్, కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్ పర్యవేక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వృద్ధులను, దివ్యాంగులను వీల్ చైర్లలో తీసుకెళ్లి ఓటు వేయించారు. కొత్తగా వచ్చిన ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చాలా వరకు పోలింగ్ ఉత్సాహంగా జరిగింది. ఓటు వేయడం చైతన్యం రావడంతో పోలింగ్ శాతం పెరిగింది.

లింగుపల్లి గ్రామంలో 95 శాతం పోలింగ్

నవతెలంగాణ-మిరుదొడ్డి



శాసనసభ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గం లింగుపల్లి గ్రామంలో 95 శాతం పోలింగ్ నిర్వహించారు. మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో అధికంగా పోలింగ్ నమోదైంది. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరి వినియోగించుకోవడం పట్ల యువకులు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో డి బిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, రాజు కిరణ్ నవీన్ మహేష్ బిక్షపతి అశోక్ యువకులు గ్రామ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటు వేసిన రఘునందన్‌రావు



నవతెలంగాణ దుబ్బాక రూరల్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు తన సొంత గ్రామమైన బొప్పాపూర్‌లోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో గురువారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల అధ్యక్షుడు అరిగే కృష్ణ, గ్రామస్తులు ఉన్నారు.

ఎమ్మెల్యే గులాబీ చొక్కా ధరించి వచ్చారని..

- మండల కేంద్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య స్వల్ప ఉద్రిక్తత
- అధికారుల తీరుపై కాంగ్రెస్ శ్రేణుల అసహనం

నవతెలంగాణ-బెజ్జంకి

ఎమ్మెల్యే గులాబీ రంగు చొక్కా దరించి వచ్చి ఓటర్లను ప్రభావితం చేస్తున్నాడని మండల కేంద్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. మానకొండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ ఎన్నికల సరళిని పరిశీలించడానికి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని గురువారం సందర్శించేందుకు రావడంతో గమనించిన కాంగ్రెస్ శ్రేణులు అభ్యంతరం తెలిపారు.



బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన రసమయి బాలకిషన్ తన పార్టీ రంగు చొక్కా దరించి వచ్చి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించడం ఓటర్లను ప్రభావితం చేయడమేనని అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని నినాదాలు చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల శ్రేణుల మధ్య స్వల్ప ఉద్రిక్తత నెలకోనగా పోలీసులు ఇరువర్గాలను చెదరగోట్టారు.ఉద్రిక్తత వాతావ రణం మధ్య ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ యదావిధిగా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సంరక్షకుల మధ్య వేళ్లిపోవడం విశేషం.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

నవతెలంగాణ-చేర్యాల



శాసనసభ ఎన్నికల సందర్భంగా గురువారం చేర్యాల పట్టణ కేంద్రం తోపాటు మండలంలోని గ్రామాలలో ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుండే ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘట నలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చేర్యాల పట్టణంలోని ఆయా పోలింగ్ కేంద్రాలలో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మె ల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి దంపతులు, సిపిఎం సిద్దిపేట జిల్లా కార్య దర్శి ఆముదాల మల్లారెడ్డి, చేర్యాల మున్సి పల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి దంప తులు, ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. బిఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా చేర్యాల పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో నివసించే ఓటర్లను ఓ పార్టీకి చెందిన నాయకులు హైదరాబాద్ నుండి గ్రామానికి పిలిపించి డబ్బులు ఇవ్వఓలేదని ఆ పార్టీ నాయకుని ఇంటి వద్దకు చేరుకొని ఓటర్లు ఆందోళనకు దిగడంతో విషయం తెలుసుకున్న పోలీస్ అధికారులు అక్కడకు చేరుకుని సర్దిచెప్పి పంపించారు.



దుబ్బాకలో బీఆర్ఎస్ జెండా రెపరేపలాడటం ఖాయం

- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-తొగుట



దుబ్బాక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని మెదక్ పార్లమెంటు సభ్యులు, దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి గారు పేర్కొన్నారు. గురువారం ఎన్నికల సందర్భంగా మండలంలోని గోవర్ధన గిరి, జప్తి లింగారెడ్డిపల్లి, వెంకటరావుపేట, తొగుట లో పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కత్తిగాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంగా కార్యకర్తలు బీఆర్ఎఫ్ పార్టీ శ్రేణులు శ్రేణులు అండగా నిలిచాన్నారు.ఎవరెన్ని కుట్రలు చేసినా దుబ్బాక ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవడం ఖాయమన్నారు.మూడు ఏళ్ల క్రితం జరిగిన ఉప ఎన్నికల్లో దుబ్బాకలో ఏం కోల్పోయామో దుబ్బాక ప్రజలు గుర్తించారన్నారు. దుబ్బాక ప్రజలకు జీవితాంతం సేవ చేస్తూ రుణం తీర్చుకుం టానని ఆయన పేర్కొన్నా రు. ఆయన వెంట సీనియర్ నాయకులు భోంపల్లి మనోహర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మండలంలో ప్రశాంతంగా పోలింగ్



నవతెలంగాణ-నంగునూరు

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేట నియోజకవర్గ శాసనసభ ఎన్నికల సందర్భంగా నంగునూరు మండలంలోని 37 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. నంగునూరు మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజగోపాల్ పేట ఎస్.ఐ.మోహన్ రెడ్డి, పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న వివిధ పార్టీ నాయకులను దూరంగా ఉండాలని సూచించారు. నంగునూరు మండలం లోని రాజగోపాల్ పేటలో ఈవీఎం మోరాయించడంతో పోలింగ్ కొద్దిసేపు నిలిపివేశారు.వెంటనే సరిచేసి పోలింగ్ పునః ప్రారంభించారు.ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పోలింగ్ మందకొడిగా సాగింది, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వేగం పుంజుకుంది. ఐదు లోపు ఓటింగ్ లైన్ పాల్గొన్న వారిని ఓటు వేయడానికి అవకాశం కల్పించారు. 85 శాతంలోపే నంగునూరు మండల పోలింగ్ నమోదు కానుండటంతో హరీశ్‌రావు మెజార్టీ ఎంత ఉంటుందని చర్చించుకుంటున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
7
శుక్రవారం | 01-12-2023 | www.navatelangana.com

మందకోడిగా కొనసాగిన పోలింగ్

- చెదురు మొదలు సంఘటనలు మినహా ప్రశాంతం
- పోలింగ్ కేంద్రాలను పరిశీలన



నవ తెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం మందకోడిగా కొనసాగింది. ఉదయం పూటనే పోలింగ్ కేంద్రాలు తెరవకముందే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ బూతుల వద్ద బారులు తీరారు. ఉదయం 9 గంటల వరకు 10 శాతం 11 గంటల వరకు 23% మధ్యాహ్నం ఒకటి గంట వరకు 39% రెండు గంటల వరకు 58% నాలుగు గంటల వరకు 67% పోలింగ్ జరిగింది. సాయంత్రం 5 వరకు ఇంకా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరి ఉండటంతో రాత్రి 7 గంటల వరకు చివరి ఓటర్ నమోదు శాతం కావచ్చని అధికారులు అంచనా వేశారు. గత శాసనసభ ఎన్నికల్లో కూడా జహీరాబాద్ నియోజకవర్గంలో 83% పోలింగ్ నమోదు కాగా ఈ సంవత్సరం 85% నమోదవుతుందని విశ్లేషకులు అంచనా వేశారు.

పోలింగ్ కేంద్రాలను సెంట్రల్ అబ్జర్వర్

జహీరాబాద్ పట్టణంలోని వివిధ పోలింగ్ బూత్‌ల వద్ద చెదురుమదురు సంఘటన మినహా పోలింగ్ ప్రశాంతంగానే ముగిసింది. ఝరాసంగం, కోహిర్, మొగుడంపల్లి, జహీరాబాద్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలో మోరాయించగా వాటిని టెక్నికల్ సిబ్బంది ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించారు. పలు పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలో ఆలస్యంగా పనిచేయడంతో ఓటర్లు ఓటు వేసేందుకు లైన్లో వేచి ఉండి అసహన వ్యక్తం చేశారు. మోడల్ పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు బెలూన్లతో అలంకరించి ఓటర్లకు పూర్తిస్థాయిలో కనీస సౌకర్యాలను కల్పించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కూడా ఇదే మాదిరిగా ఏర్పాట్లు చేయాలని ఓటర్లు కోరారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

313 పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు

5 గంటలకు 76.12 శాతం

పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు

నవతెలంగాణ-జోగిపేట

మండలంలో గురువారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గంలో మొత్తం 313 పొలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఓటర్లు పట్టణంలోని పలు వార్డుల్లో బారులు తీరారు. పోలింగ్ పూర్తయ్యేసరికి 76.12 శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలో జోగిపేట, తాలెల్మలో పోలింగ్ కేంద్రంలోని ఈవీఎంలు మురాయించాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు నాయకులు ఎన్నికల సరళిని పరిశీలించారు. ఓటు వేసిన అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 70 స్థానాలు కాంగ్రెస్ గెలవబోతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో సానుకూలత ఉందని, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు పోతుందన్నారు. బీజేపీ అభ్యర్థి బాబు మోహన్ మాట్లాడుతూ గతంలో తాను చేసిన పనులకు ఓట్లు వేస్తే న్యాయం గెలిచినట్టని, ఇతర పార్టీల అభ్యర్థులు గెలిచినట్లయితే మద్యం డబ్బులకు బానిసలుగా మారినట్లు అని ఆయన అభివర్ణించారు. డీఎస్పీ అభ్యర్థి ముప్పారం ప్రకాశం మాట్లాడుతూ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకొని, దేశ రాష్ట్ర భవిష్యత్తులో భాగస్వాములు కావాలని, బీఎస్పీని ఆదరించాలని ఆయన కోరారు.





నవతెలంగాణ- గుమ్మడిదల

మండల పరిధిలోని గ్రామాలలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో ఉన్న ప్రజా ప్రతినిధులు యువకులు రైతులు మహిళలు భారీ సంఖ్యలో క్యూలో నిల్చుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య హెూరాహెూరీగా పోలింగ్ జరిగింది.

ప్రశాంతంగా ముగిసిన శాసనసభ ఎన్నికలు

- ఎన్నికల విధుల్లో గుండెపోటుతో సిబ్బంది మృతి
- బీఎస్పీ అభ్యర్థి గ్రామంలో బారులు తీరిన ఓటర్లు
- గట్టి బందోబస్తు నడుమ ఈవీఎంల గీతం కు తరలింపు
- గెలుపు మాదే అంటే మాదే అంటున్న అభ్యర్థులు
- చెదురు మధురు సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతం

నవ తెలంగాణ - పటాన్ చెరు


పటాన్ చెరు నియోజకవర్గంలో గురువారం చెదురు మధురు సంఘటనలు మినహా గురువారం పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. 69 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. ఇస్నాపూర్ గ్రామంలో విధులో ఉన్న ఎన్నికల సిబ్బంది సుధాకర్ గుండెపోటుతో మరణించారు. బీఎస్పీ అభ్యర్థి నీలం మధు సొంత గ్రామమైన చిట్కుల్ గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు బారులు తీరారు. నీలం మధు గ్రామంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సతీసమేతంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్ గౌడ్ సతి సమేతంగా అమీన్పూర్ లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని గౌతమ్ నగర్ లో సాయంత్రం బి ఆర్ఎస్, బిజెపి వర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. పట్టణంలోని మంజీరా హైస్కూల్లో బి ఆర్ఎస్ రిగ్గింగ్ పాల్పడ్డారంటూ కాంగ్రెస్ అభ్యర్థి కాట సతీమణి సుధా సెంటర్ కు రావడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. వస్తలేదు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఆవంచనియ సంఘటనలు జరగకుండా సీఐ లాలూ నాయక్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా ఎమ్మెల్యే అభ్యర్థులు మాత్రం గెలుపు మాది అంటే మాదే అంటూ సన్నిహితుల వద్ద ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో చతుర్ముఖ పోటీలలో విజేత ఎవరు అని తెలవాలంటే డిసెంబర్ మూడో తేదీ వరకు వేచి చూడాల్సిందే మరి.

కొమురవెల్లిలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మండల వ్యాప్తంగా 11 గ్రామాలలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా పోలింగ్ శాతం నమోదయింది. రాత్రి వరకు మండలంలో పోలింగ్ కొనసాగింది. గ్రామాల వారీగా పోలింగ్ శాతం ఈ విధంగా ఉంది. అయినా పూర్, రసూల బాద్ కలిసి 85.34%, రామ్ సాగర్ లో 93.4%, గౌరయపల్లి లో 87.1%, గురువన్న పేటలో 92.4%, కొమురవెల్లి లో 86%, కిష్టంపేటలో 90.75%, మర్రి ముచ్చాల లో 88%, పోసాన్ పల్లి లో 92 శాతం, లెనిన్ నగర్ లో 91.87%, తపస్ పల్లి లో 94%, పోలింగ్ నమోదయింది.





ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని 177 పోలింగ్ బూత్‌లో టీఎస్ఐడిసి చైర్మన్ మహమ్మద్ తన్వీర్ కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 11 గంటలకు పోలింగ్ బూత్ కు వచ్చిన మహమ్మద్ తనివిర్ లైన్‌లో వేచి ఉండి ఓటు హక్కును వినియోగించుకొని పోలింగ్ సరలిని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని పస్పూర్ గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కుటుంబ సభ్యులతో కలసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కే మాణిక్యరావు తన కుటుంబ సభ్యులతో కలిసి ఝరాసంగం మండలంలో, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌లు తన కుటుంబ సభ్యులతో కలసి ఝరాసంగం మండలంలోని తమ సొంత గ్రామమైన ఈదులపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ డిసిఎంఎస్ చైర్మన్ జైపాల్ రెడ్డి పట్టణంలోని మార్కెట్ కమిటీ పరిధిలో ఏర్పాటు చేసిన బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకొని అభ్యర్థులు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ ఏ చంద్రశేఖర్ ఓటు వికారాబాద్‌లో, బీజేపీ అభ్యర్థి రాంచందర్ రాజనర్సింహ ఓటు ఆందోల్‌లో ఉన్నందున వారు తమ ఓటు హక్కును జహీరాబాద్‌లో వినియోగించుకోలేకపోయారు.

పోలింగ్ సరోజినీ పరిశీలించిన ప్రముఖులు

బీఆర్ఎస్ అభ్యర్థి కే మాణిక్ రావు తన కుటుంబ సభ్యులతో కలసి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి పోలింగ్ సరళిని పరిశీలించారు. మాణిక్ రావు కుమారుడు మిథున్ రాజ్, అల్లుడు బాబి సైతం నియోజకవర్గంలో పర్యటించారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్ ఆయన సతీమణి కూతురు, అల్లుళ్ళు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ పోలింగ్ సరళిని పరిశీలించారు.

జిన్నారంలో ఓటేసిన ప్రముఖులు





నవతెలంగాణ-జిన్నారం

సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, ఆయన సతీమణి మాజీ ఎంపీపీ కుంచాల నిర్మల ప్రభాకర్ శివనగర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్ జిన్నారంలో, ఎంపీపీ రవీందర్ గౌడ్ వావిలాలలో, ఉపాధ్యక్షులు గంగు రమేష్, సర్పంచ్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి బృందం ఊట్లలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ కొడకంచిలో, సర్పంచులు అంతి రెడ్డిగారు లావణ్య శ్రీనివాస్ రెడ్డి జిన్నారంలో, పులిగిల్ల ప్రకాశం చారి గడ్డపోతారంలో, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు వార్డు సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు



ఓటు హక్కును వినియోగించుకున్న పట్నం మాణిక్యం



నవతెలంగాణ-సంగారెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం కుటుంబ సభ్యులతో కలిసి ఫసల్వాది గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్నం మాణిక్యంతో పాటు బీఆర్ఎస్ యువ నేత పట్నం రవితేజ కూడా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

86 శాతం ఓటింగ్

నవతెలంగాణ పెద్దశంకరంపేట

మండలంలో గురువారం జరిగిన ఎన్నికల్లో 86.05 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మండలంలోని 27 గ్రామపంచాయితీల పరిధిలో 41 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన ఎన్నికలలో 30,084 మంది ఓటర్లకు గాను 25,890 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుండి తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మండలంలో పోలింగ్ ప్రశాతంగా ముగిసింది.

పాపన్నపేటలో 84 శాతం పోలింగ్



నవతెలంగాణ -పాపన్నపేట

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పాపన్నపేట మండలంలో 84 శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 41,429 ఓట్లు ఉండగా, ఇందులో 34,869 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 16,463, మహిళలు 18,406 మంది ఓటు వేశారు. మిన్పూర్, ఎల్లాపూర్లో ఇవిఎంలు మొరాయించాయి. కొత్తపల్లి పోలింగ్ కేంద్రం వద్ద గుమిగూడిన జనాలను పోలీసులు లాఠీలతో చెదరగొట్టగా కొంత మందికి గాయాలయ్యాయి. యూసుఫ్‌పేటలో మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, కొత్తపల్లిలో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పరిణీత, ఆర్కెలలో జెడ్పీటీసీ షర్మిల శ్రీనివాస్‌రెడ్డి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఓటుకు నూతన ఓటర్ల ఉత్సాహం

నవతెలంగాణ-రామచంద్రాపురం



గురువారం జరిగిన శాసనసభ ఎన్నికల్లో నూతన ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన యువకులు మొదటిసారి ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి ఓటు వేశారు. ఓటు హక్కు తమ బాధ్యతగా, హక్కుగా భావించి రాష్ట్ర అభివృద్ధి కోసం తాము సైతం నిర్ణయాత్మక శక్తిగా ఉండాలనే ఉద్దేశంతో తప్పకుండా ఓటు వేయాలని వచ్చి ఓటు వేసినట్టు సాయి రాజ్ అనే యువకుడు తెలిపారు. అందరూ తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని, మొదటిసారి ఓటు వేసినందుకు చెప్పలేనంత ఆనందం కలిగిందని తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే. రాజయ్య

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి నియోజకవర్గంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే. రాజయ్య ఆర్ అండ్‌బీలో ఏర్పాటు చేసిన 110 నంబర్ పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు



నవతెలంగాణ - ఝరాసంగం

జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోనీ ఝరాసంగం మండలంలో గురువారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కే మాణిక్ రావు సొంత గ్రామమైన ఝరాసంగంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముందుగా జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం తన కుటుంబ సభ్యులతో కలిసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్ నంబర్ 62లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ అభ్యర్థి ఏ చంద్రశేఖర రావు ఝరాసంగం, మాస్నూర్, ఎల్గోయి తదితర గ్రామాల్లో పర్యవేక్షించారు. ఈదులపల్లి గ్రామంలో మల్కాపురం శివకుమార్, ఎల్గోయి గ్రామంలో ఉమాకాంత్ పాటిల్ ఓట్ను హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లు ఉదయం 7 గంటల నుండి పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేశారు. ఓటర్ స్లిప్పులు లేని వారికి బిఎల్వోలు రాసిచ్చిన స్లిప్పులతో ఓటు వేశారు. పోలింగ్ స్టేషన్ ల వద్ద జనాలు గుమ్మిగూడ కుండ పోలీసులు వారిని చదరగొట్టారు. పోలింగ్ కేంద్రాలకు ఎక్కువ దూరంలో ఓటర్లను తరలించేందుకు వాహన సౌకర్యాలను కల్పించారు. అంతేకాకుండా వృద్ధులకు, సీనియర్ సిటిజనులకు, వీల్ చైర్ లను అందుబాటులో ఉంచారు. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత ఎల్గోయి,చిలేమామిడి గ్రామాలలో సాయంత్రం ఏడు గంటల వరకు ఓటింగ్ కొనసాగింది.

నవతెలంగాణ - గుమ్మడిదల

గుమ్మడిదల మండల పరిధిలోనీ గ్రామాలలో పోలింగ్ కేంద్రాలలో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు, దూల్మిట్ట మండలంలోని అన్ని గ్రామాలలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. దూల్మిట్ట మండలంలోని కొండాపూర్, బైరాన్‌పల్లి, జాలపల్లి, తోర్నాల గ్రామాలలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు భారీగా బారులు తీరారు. లింగాపూర్, తోర్నాల, జాలపల్లి, నర్సాయపల్లి గ్రామాలలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య సల్ప వివాదం చెలరేగింది.

నవతెలంగాణ రామచంద్రాపురం

రామచంద్రాపురం, భారతి నగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రాంతంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం నుండి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని క్యూలైన్లో నిల్చొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప, భారతి నగర్ కార్పొరేటర్ సింధు పట్టణంలో తమ కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నవ తెలంగాణ-రాయపోల్

తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సాధారణ శాసనసభ ఎన్నికలు రాయపోల్ మండల పరిధిలోని గ్రామాలలో గురువారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ఎన్నికలు ముగిసాయి. రాయపోల్ మండల పరిధిలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా 32 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 21,125 ఓటర్లు ఉన్నారు.వీరిలో మహిళ ఓటర్లు 10,682 మంది ఉన్నారు. పురుషులు 10,443 మంది ఉన్నారు. ఇందులో 9,769 మంది మహిళలు 9,657 మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం రాయపోల్ మండల వ్యాప్తంగా 19,426 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా మండల వ్యాప్తంగా 89.92 శాతం పోలింగ్ నమోదయింది. అలాగే రాయపోల్ మండల కేంద్రం, అనాజిపుర్ గ్రామాలలో దుబ్బాక ఎమ్మెల్యే, బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు, మెదక్ ఎంపీ, టిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డిలు ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

నవతెలంగాణ-వెల్దుర్తి

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాల వ్యాప్తంగా గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఏడు గంటలకు మొదలై సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. మెదక్ జిల్లాలోని ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాల్లో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఓటు హక్కును విరిగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. 80 శాతం వరకు పోలింగ్ అయినట్లు తెలిపారు. పోలింగ్ స్టేషనులకు బీఆర్ఎస్ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి, బిజెపి అభ్యర్థి మురళి యాదవ్, ఇండిపెండెంట్ అభ్యర్థి లక్ష్మారెడ్డి పోలింగ్ వ్యవహార శైలిని పరిశీలించారు.

నవతెలంగాణ కోహీర్

మండలంలోని గొడిగృపలిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భూమయ్య తదితరులు గురువారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. నరసింహారెడ్డి, దేశ్ముఖ రహిమ తల్లి అజు పటేల్ ఎక్స్కో ఆప్షన్ నెంబర్ అసురపల్లి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - నార్సింగి

మండల వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అన్ని పోలింగ్ కేంద్రాలలో వృద్ధులకు, దివ్యాంగులకు తగు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ బూతు సంఖ్య 211 ను మోడల్ బూత్ గా ఏర్పాటు చేశారు. బూత్‌ను అలంకరించి, ఓటర్ల కోసం సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేయగా, యువకులు ఫోటోలు దిగుతూ కనిపించారు. మండల వ్యాప్తంగా ఓటర్లలో ఉత్సాహం కనిపించింది. జెడ్పీటీసీ బాణాపురం కృష్ణా రెడ్డి















వల్లభాపూర్‌లో ఓటు హక్కును వియోగించుకోగా, ఎంపిపి సబిత రవీందర్ వల్లూరులో తన ఓటును వేశారు. వైస్ ఎంపిపి సుజాత శంకర్, జప్తి శివనూర్ గ్రామ సర్పంచ్ షేక్ షరీఫ్ గ్రామ పాఠశాల లోని బూత్‌లో, పెద్ద తాండా సర్పంచ్ చత్రియా నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బాషా నాయక్ నర్సంపల్లి బూత్ లో తమ ఓట్లను వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘునందన్ రావు లు మండల కేంద్రం లోని పోలింగ్ బూత్‌లను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. బూత్ నెం 211లో జనాలు ఎక్కువగా ఉండడంతో ఎక్కువ సేపు వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. పోలింగ్ ముగిసే వరకు మండల హెడ్ క్వార్టర్‌లో 87.79శాతం, దుబ్బాక నియోజకవర్గ గ్రామాలలో 93.02 శాతం, మెదక్ నియోజకవర్గ గ్రామాలలో నమోదు 88.87 శాతం జరిగింది. మొత్తం మీద మండలంలో 88 శాతం ఓటింగ్ నమోదు అయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఓటింగ్ శాతం అధికంగా నమోదు కావడం పై అధికారులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.